ప్రజాశక్తి


సోమవారం 8 ఏప్రిల్ 2024 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా





విమానాశ్రయం ఫ్లైఓవర్ పూర్తి

త్వరలో అందుబాటులోకి...



ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) చేపట్టిన ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. 1.4 కిమీ ఫ్లైఓవర్ విమానాశ్రయం ప్రవేశద్వారం నుండి ప్రారంభమై కేసరపల్లిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఏసుప్రభు విగ్రహం వద్ద ముగుస్తుంది. విమానాశ్రయం సమీపంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) పై రోడ్డు ప్రమాదాల నివారణకు, విమానాశ్రయంలోకి వెళ్లే వాహనాలకు అంతరాయం లేకుండా చేసేందుకు దీనిని నిర్మించారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు కొన్ని నెలల క్రితం ఇంటీరియర్ టెర్మినల్ బిల్డింగ్, ఎన్ హెచ్ - 16 వైపు సమాంతరంగా గేట్ దగ్గర వన్-వే ఫ్లైఓవర్ నిర్మాణానికి పూనుకున్నారు. నాలుగు లేన్‌లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ దాదాపు రూ.24 కోట్లు వెచ్చించింది. వంతెన నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న సంస్థ పనులు ప్రారంభించి పూర్తి చేసింది. తొలుత ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డును నిర్మించారు. ఎయిర్‌పోర్టు సమీపంలో సర్వీస్ రోడ్డు, సీసీ డ్రెయిన్ పనులు చేశారు. ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల సమీపంలోని ఎన్‌హెచ్‌కి అవతలివైపు చెట్లను తొలగించారు. ఏడాదిలోగా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఎన్‌హెచ్ఏఐ, కాంట్రాక్టు కంపెనీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వచ్చినా రెండేళ్ల పాటు పనులు చేయాల్సి వచ్చింది. కేసరపల్లి నుంచి విమానాశ్రయం వరకు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వీవీఐపీల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి, విమానాశ్రయం సమీపంలో ఫ్లైఓవర్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ హైవేని కోరింది. వెంటనే ఫ్లైఓవర్ నిర్మాణానికి సర్వే నిర్వహించి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. గన్నవరం గ్రామంలోని పొట్లూరి దాబా సెంటర్ నుంచి ఫ్లైఓవర్ ప్రారంభమై విమానాశ్రయ ప్రధాన ద్వారం (మిగతా 6లో)



ఉయ్యూరులో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

తులసి వనంలో గంజాయి మొక్కలు

వైసిపి నేతలపై విరుచుకుపడ్డ చంద్రబాబు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, కంకిపాడు, పెదపారుపూడి

మహనీయులు నడియాడిన తులసి వనంలాంటి గడ్డపై కొన్ని గంజాయి మొక్కలు పెరుగుతున్నాయని, పవిత్రమైన ఈ మట్టిని మలినం చేస్తున్నాయని టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను ఓడించడం ద్వారా ఈ గంజాయి మొక్కలను సమూలంగా పెరికివేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు, ఉయ్యూరుల్లో ఆదివారం ఆయన 'ప్రజాగళం' యాత్ర నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రు ఎన్‌టిఆర్ సెంటరు, ఉయ్యూరు నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభల్లో చంద్రబాబు మాట్లాడారు. ముందుగా పామర్రు మార్కెట్ యార్డు సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు హెలీకాప్టర్లో వచ్చారు. అనంతరం జిల్లాలోని టిడిపి నాయకులతో బస్సులో కొద్దిసేపు మంతనాలు జరిపారు. అక్కడి నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభ వేదిక వరకు ఆయన రోడ్ షో నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద చంద్రబాబును టిడిపి శ్రేణులు గజమాలతో సత్కరించాయి. అక్కడ నుంచి పామర్రు బైపాస్ మీదుగా బలిపర్రు అడ్డరోడ్డు, కురుమద్దాలి, కనుమూరు, గోపువానిపాలెం ఉయ్యూరు వరకు 12 కిలోమీటర్లు ఓపెన్ టాప్ వాహనంలో చంద్రబాబు రోడ్ షో నిర్వహించారు. దారి పొడుగునా టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఉయ్యూరులో జరిగిన సభలో పాల్గొన్నారు. పామర్రు, ఉయ్యూరు సభల్లో చంద్రబాబు మాట్లాడుతూ ఈ గడ్డపై సాధారణ కుటుంబంలో పుట్టిన నందమూరి తారక రామారావు తెలుగు వారి సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తుచేశారు. కృష్ణాజిల్లా గడ్డపై ఎంతో మంది సాహితీ, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, సినీ రంగాలకు చెందిన ఎంతో మంది మహనీయులు పుట్టారని గుర్తుచేశారు. కానీ ఈగడ్డపైనే పుట్టిన కొందరు వైసిపి నేతలు బూతులతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సుపరిపాలనకు అర్థం తెలియని వారు (మిగతా 6లో)

ఆర్యవైశ్యుల సభలో ఉద్రిక్తత

రాజకీయ ప్రసంగాలు చేసిన వెలంపల్లి, బొండా

పోలీసులు రంగప్రవేశం · అర్థాంతరంగా కార్యక్రమం నిలిపివేత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని అమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఆర్య వైశ్యుల అర్బన్ కమిటీ నూతన కార్యవర్గ సమావేశంలో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో కార్యవర్గ ప్రమాణస్వీకారాన్ని అర్థాంతరంగా నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే ఆదివారం ఉదయం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగతుండగా ఈకార్యక్రమానికి అతిధులుగా శాసన సభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్, టిడిపి సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా హాజరయ్యారు. అయితే సభలో ఇద్దరూ రాజకీయ ప్రసంగాలు చేశారు. దీంతో సభా ప్రాంగణమంతా అరుపులు కేకలతో దద్దరిల్లింది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి రాజకీయ పార్టీ నాయకులతో సంబంధం లేకుండానే కార్యక్రమం నిర్వహిస్తున్నామంటే అనుమతులు ఇచ్చామన్నారు. అయితే రాజకీయ ప్రసంగాలు చేయడంతో వివాదం చెలరేగడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి హాల్‌లోని సభ్యులను బయటకు పంపించివేసి కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఇదే క్రమంలో పోలీసులు సభా ప్రాంగణానికి ఎందుకు వచ్చారని తెలుగుదేశం నాయకులు డూండి రాకేష్ వాగ్వాదానికి దిగడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉంటే నిర్వాహకులు మాట్లాడుతూ తమ సంఘం ప్రమాణ స్వీకారం సందర్భంగా వివాదం జరగడం బాధాకరమని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

సుజనా చౌదరి, కేశినేని చిన్నిపై వైసిపి ఫిర్యాదు

వార్త 6లో



రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : సోమవారం సాయంత్రం 6.36
సహర్ : మంగళవారం ఉదయం 4.42

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాలపాడులో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులను అభినందించారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న... మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న శ్రీ సత్యసాయి సేవాసమితి సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వాసుదేవరావు, వైసిపి నాయకులు బొల్లి నేని శ్రీనివాసరావు, సర్పంచ్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

మున్నా భాయ్ బ్రదర్స్ ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని జామ (పెద్ద) మసీదులో వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ మున్నా బ్రదర్స్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ రంజాన్ మాసం సమాజంలోని భక్తి, భావం, పవిత్రత, సేవా సంప్రదాయం, కట్టుబాట్లకు నిదర్శనం ఇదాయిత్ అంటే ముస్లిం సోదరులు తనతో పాటు పేదవారికి సహాయం చేయాలని ఇస్లాం చెప్పిన ప్రకారం మనందరం ఒకరికొకరు చేదోడు వాదోడులుగా ఉండాలన్నారు. మగ్రిబ్ నవాజ్ అనంతరం భారీ లంగర్ ఏర్పాటుచేసి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మత పెద్దలు, మున్నా బ్రదర్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నందిగామలో ఆదివారం సాయంత్రం వైసీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎంపి కేశినేని నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పరిచయ కార్యక్రమం



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎంఎల్‌ఎగా తనకు ఒక అవకాశం ఇవ్వాలని నందిగామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందా వజ్రయ్య పేర్కొన్నారు. నందిగామ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మంద వజ్రయ్య, నందిగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నందిగామ అభ్యర్థి మందా వజ్రయ్య మాట్లాడుతూ కంపెనీలు రావాలన్నా పరిశ్రమలు కావాలన్నా యువతకు ఉపాధి దొరకాలన్న అభివృద్ధి చెందాలంటే ఒక ప్రత్యేక హోదా తప్పనిసరి అన్నారు. బిజెపి, టిడిపి, వైసిపిలతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చే పరిస్థితి కనపడటం లేదని చెప్పారు. కాబట్టి దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పాలేటి సతీష్, గోపు నరేంద్ర, భాస్కరరావు పాల్గొన్నారు.

కూటమి గెలుపు- అభివృద్ధికి మలుపు : సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : కూటమి గెలుపు – అభివృద్ధికి మలుపు అని నందిగామ ఎన్‌డిఎ అభ్యర్థి తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఆదివారం టిడిపి, జనసేన, బిజెపి పట్టణ, మండల నాయకులతో కలిసి అనాసాగరం కాలనీ (1వ వార్డు)లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనతో పాటు ఎంపి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)ని గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి, అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే 4 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పారు.



ప్రచారంలో సౌమ్య

ఉపవాస విరమణ దీక్ష

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని 11వ వార్డు క్యూబా మసీద్ లో శనివారం రాత్రి పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస విరమణ దీక్షలో ముస్లిం సోదరులతో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్, టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. నెట్టెం శ్రీ రఘురామ్ మాట్లాడారు.

ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి - నందిగామ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏసిపి డాక్టర్ బి రవి కిరణ్, నందిగామ సిఐ జె.హనీష్ ఆధ్వర్యంలో కేతావీరునిపాడులో ప్రజలకు శనివారం రాత్రి ఎంపిపి స్కూల్‌లో ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేందుకు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎటువంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు ఎవరూ పాల్పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పండు దొర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **కంచికచర్ల :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిఐ చంద్రశేఖర్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కీసర గ్రామంలో ప్రజలకు ఆదివారం రాత్రి ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సక్రమించే ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్భయంగా భయపక్షపాతాలు లేకుండా ఉండేందుకు ప్రజలకు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో



నందిగామలో ఏసిపి రవికిరణ్



కంచికచర్లలో మాట్లాడుతున్న సిఐ చంద్రశేఖర్

జరుపుకోవాలని ఎటువంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పొడొద్దని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటాయన్నారు.

నల్లగట్ల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - విస్సన్నపేట : దళితవాడలో 'మేము సిద్ధం' అంటూ జగన్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ తిరువూరు నియోజకవర్గ వైఎస్‌ఆర్సిపి అభ్యర్థి నల్లగట్ల స్వామి దాస్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సాగులో ఉన్న దళితులకు ఇచ్చిన భూమి నీరు లేక నిరుపయోగంగా ఉందని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ భూమి విషయమై పూర్తి సమాచారం తెలుసుకొని రైతులకు మంచి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మెర్సి వనజాక్షి, జడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర్ రెడ్డి, కెడిసిసి డైరెక్టర్ భూక్యరాణి, నరసాపురం వైసిపి నాయకులు అల్లు గణపతిరెడ్డి, తానంకి రాంబాబు, చెన్నారెడ్డి మండల గ్రామ సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో నల్లగట్ల స్వామిదాస్, తదితరులు




మాట్లాడుతున్న వల్లభనేని రవీంద్ర

ఆహారం, వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మంచి ఆహారం, వ్యాయామంతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండగలరని జనవిజ్ఞానవేదిక (జెవివి) జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ వల్లభనేని రవీంద్ర అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం జెవివి ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున జూనియర్ కళాశాలలో మంచి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని పౌరుల ప్రాథమిక హక్కుగా ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు ఎం.రాం ప్రదీప్, డి.సుదర్శన్, బి.సైదులు, కళాశాల ప్రిన్సిపాల్ కె.శేషగిరిరావు, ఎపిఎన్ జిఒ తిరువూరు తాలూకా అధ్యక్షులు ఎం.ప్రకాష్ బాబు, ఆధ్యాపక సిబ్బంది జి.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయినికి సన్మానం

ప్రజాశక్తి - తిరువూరు : నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రామసీతకు స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయినీని సన్మానిస్తున్న దృశ్యం

జరిగింది. సమితి అధ్యక్షులు టీ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లభాష ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు.ఎం. రాంప్రదీప్, పాఠశాల నిర్వాహకులు యు. వాణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉదయభాను, తదితరులు

కాంట్రాక్టర్ వాసుకు నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని అయ్యప్ప నగర్ లిటిల్ ఏంజెల్ స్కూల్ గ్రౌండ్‌లో ప్రముఖ కాంట్రాక్టర్ సంభంగి శ్రీనివాసరావు (వాసు) దశదిన కార్యక్రమంలో ఆదివారం ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

పాలనలో తేడా గమనించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో టిడిపి నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నందిగామ పట్టణంలోని చిన్న మసీదు ఏరియాలో... ప్రతి గడపకు తిరుగుతూ ఎంఎల్‌ఎ ఓట్లు అడిగారు. తమ సోదరుల మీద అబద్ధాల ప్రచారం చేసుకోవడం తప్పితే... "టిడిపి నేతలు చేసింది ఏమీ లేదన్నారు. నందిగామలో గత తెలుగుదేశం పాలన లోని ఐదేళ్లలో అవినీతి తప్ప... పట్టణానికి చేసింది ఏమీ లేదన్నారు. దోపిడీ, అక్రమాలతో నందిగామను టిడిపి నేతలు లూటీ చేశారన్నారు. నందిగామలో... గత తెలుగుదేశం పాలనకు... మా పాలనకు... తేడాను ప్రజలు గమనించాలన్నారు. మున్సిపాలిటీ అప్ గ్రేడేషన్ ట్రాఫిక్, పోలీస్ స్టేషన్, రెవిన్యూ డివిజన్, ఇవన్నీ మా హయంలో సాధించినవేనని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నందిగామ మున్సిపల్ చైర్మన్ ఓర్సు లక్ష్మీ, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని సరోజినీదేవి మృతి

ప్రజాశక్తి - వీరులపాడు : సిపిఎం సానుభూతి పరురాలు గొల్లపల్లి సరోజినీ దేవి గొల్లపూడి గ్రామంలో అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె అంతిమయాత్ర చెన్నార పాలెంలో కుటుంబసభ్యులు నిర్వహించారు. సరోజినీ దేవి భర్త గొల్లపల్లి వీరయ్య తెలం గాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి పలు కేసుల్లో జైలు జీవితం గడిపారు. ఆ సమయంలో భర్తకు తోడుగా ఉంటూ కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. సరో జినీ దేవికి ఇద్దరు కుమారులున్నారు. ఆమె కుమా రుడు రామ్మోహన్ రావు పీర్లెస్ ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులుగా కొనసాగారు.



ప్రచారంలో పాల్గొన్న విమలాభాను, తదితరులు

ఐదేళ్ల పాలనలో అందరికీ సంక్షేమం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమాన్ని అందించారని విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను అన్నారు. పట్టణంలోని 16వ వార్డు చెరువు బజార్‌లో శనివారం రాత్రి జగనన్న పాలనలో జరిగిన మంచిని వివరిస్తూ, జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను చేసిన అభివద్ధిని తెలియపరుస్తూ మరొకసారి గెలిపించాలని ఎన్నికల ప్రచారాన్ని విమలభాను నిర్వహించారు.

భిక్షాటకులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: వివిధ దేవాలయాల్లో ఎర్రటి ఎండలో భిక్షాటన చేస్తున్న వారు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, వైసిపి నాయకులు కటారి సూరిబాబు ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఆయన కుమారుడు అజయ్ 100 గొడుగులను అప్పటికప్పుడు తీసుకొచ్చి వారికి అందజేశారు.

'కొండప్రాంతవాసులకు ఇళ్లపట్టాలు కల్పిస్తా'

విజయవాడ : వ్యాపార కూడలిగా విజయవాడకు ఖ్యాతి తెచ్చిన వన్ టౌన్, దశాబ్దాలుగా అభివద్ధికి నోచుకోలేదని జైభారత్ నేషనల్ పార్టీ పశ్చిమ అభ్యర్థి పోతిన వెంకట రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. సమర్ధ నాయకత్వం లోపించడం వల్లే ఈ దుస్థితి అని, జైభారత్ పార్టీ బ్యాటరీ టార్చ్ వెలుగులో సమస్యల్ని పారదోలతామన్నారు. స్థానిక కె.ఎల్.రావు నగర్లో, మిల్క్ ఫాక్టరీ వద్ద ఆదివారం పోతిన రాము ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మురుగునీటి కాలువల వ్యవస్థను స్మార్ట్ డ్రైనేజీ సిస్టం ద్వారా మెరుగుపరిచి, దోమలు, ఇతర రోగాల బారి నుంచి పశ్చిమ ప్రజల్నిరక్షించాల్సిన తక్షణ అవసరం ఉందనిరాము చెప్పారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, టిటిడి కళ్యాణ మండపం నుండి ఆదివారం వచ్చిన ఆహారం ఉమా కాలనీలో ఉన్న పేదలు సుమారు 50 మందికి పంపిణీ చేశారు. పేదలకు పాత బట్టలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు సభ్యుడు శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
సోమవారం 8 ఏప్రిల్ 2024

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి నందిపాటి పద్మారెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పద్మారెడ్డి

ప్రజాశక్తి-గుడివాడ: విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే ఎంతో మంచిదని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ఆరోగ్యం ఉంటేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని కృష్ణాజిల్లా కన్స్యూమర్ కోర్టు న్యాయమూర్తి నందిపాటి పద్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని వెంకటేశ్వర పంక్షన్ హాల్‌లో విద్యాలయ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకటవిజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సదస్సులో ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి నందిపాటి పద్మారెడ్డి పాల్గొని విద్యార్థులకు అవగాహన సదస్సులో పలు ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు పుట్టిన నాటి నుండి చనిపోయేవరకు (కన్స్యూమర్) అమ్మకాలు, కోనుగోలు తప్పని సరి అన్నారు. వాటి విషయంలో జరిగే మోసాలపై న్యాయంకోసం కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుకునే సమయంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో వాటిని పరిష్కరించుకోవచ్చన్నారు. విద్య, ఆటలు, పాటలు, ఆరోగ్యంతో పాటు చట్టాలపై కూడ పూర్తి అవగాహనతో ఉంటే ఉన్నత శిఖరాలు ఆధిరోహించవచ్చన్నారు. మరో అతిధి ఉమారెడ్డి హోమియోస్టోర్సు ఆధినేత వైద్యులు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సేవలను వివరిస్తూ, ప్రపంచ దేశాలకు ప్రజారోగ్య రక్షణ, తీసుకోవలసిన జాగ్రత్తలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక ఆరోగ్యానికి కావలసిన కమ్యూనికేషన్ స్కిల్స్‌ని పెంపొందించుటలో విద్యార్థులను ఆకట్టుకునేల నవ్విస్తూ, ప్రేరణ కలిగేలా తెలిపారు.



పోలవరంలో 'ప్రజాదీవెన'

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండలం పోలవరం గ్రామం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా దీవెన కార్యక్రమంలో ఆదివారం పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము, కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా దీవెన కార్యక్రమం నిర్వహిస్తూ ప్రతి గడపగడపకూ వెళ్లి కరపత్రం పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక నిమ్మల తోటలోని ఆదరణ వృద్ధాశ్రమంలో చల్లపల్లికి చెందిన జన్ను అచ్చియ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు నాంచారయ్య, అయ్యప్పలు ఆదివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు శీలం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

కొల్లు రవీంద్ర, బాలశౌరి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): రాష్ట్రంలోనే మచిలీపట్నం నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చి దిద్దడమే లక్ష్యమని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి లు అన్నారు. సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా



ఆదివారం స్థానిక 39వ డివిజన్ లో ఇంటి ఇంటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ గత ఐదు ఏళ్లలో స్థానిక అధికార పార్టీ శాసన సభ్యుడు నియోజక వర్గాన్ని అన్ని రంగాలలో భ్రష్టు పట్టించారని విమర్శించారు. కాబట్టి రాబోయే ఎన్నికలలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి అభివద్ధి చేసే నాయకులకు పట్టం కట్టాలని సూచించారు.కూటమి ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఎన్నికలలోపు బందరు వైసీపీ కార్యాలయానికి టూలెట్ బోర్డ్ ఏర్పాటు ఖాయమన్నారు. అనంతరం 200 మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు, జనసేన ఇంఛార్జి బండి రామకృష్ణ, 39వ డివిజన్ ఇంచార్జ్ కట్టా అంజిబాబు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పెడన: పట్టణ పరిధిలోని బ్రహ్మపురంలో పెంచేసిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రుని కళ్యాణం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ భద్రకాళి సమేత వీరభద్రుని కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. జిల్లాలోని నలుమూల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల వారు కూడా కర్ణోద్భవ యాత్రికులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణ పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో స్వామి వారిలను ఊరేగించారు అనంతరం సోమవారం భారీ అన్న ప్రసాదములకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

ఎన్ని ఆటంకాలు ఎదురైనా పోరాటం ఆపేదిలేదు

టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ తీర్మానం



ప్రజాశక్తి-గుడివాడ: ఎన్ని ఆటంకాలు ఎదరైనా టిడ్కో గృహాల రుణమాఫీ పోరాటాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ తీర్మానించింది. ఆదివారం మల్లాయిపాలెం టిడ్కో కాలనీలోని సి96 బ్లాక్ వద్ద జరిగిన సమావేశానికి సంఘం అధ్యక్షురాలు డి సంగమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శి బి.అరుణ మాట్లాడుతూ టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ పోరాటం నైతికంగా విజయం సాధించిందని తెలిపారు. వేల సంఖ్యలో ప్రజలు రుణమాఫీ పోరాటంలోకి వస్తున్నారని, బ్యాంకులకు కిస్తీలు చెల్లించకుండా ఆపేసారని తెలిపారు. ఎవరైనా బాంక్ వారు నోటీసులు ఇచ్చినా, లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి బెదిరించినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత రెండు నెలలుగా ఎక్కడో ఒక చోట తాగునీటి సరఫరా పైపులు పగిలి పోతున్నాయని, నీటి సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. సంగమ్మ మాట్లాడుతూ రెండు రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కరించకపోతే ఖాళీ బిందెలతో మునిసిపల్ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. కొందరు రౌడీయిజం చేసి ఉద్యమాన్ని ఆపాలని చేస్తున్నారని అలాంటి వారికి లొంగిపోయే ప్రసక్తే లేదని, ఎన్ని త్యాగాలైనా చేసి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు ఎమ్ దుర్గ, కమిటీ సభ్యులు వి దుర్గ, ఎమ్ నాగేశ్వరరావు, ఆర్ శివారాంప్రసాద్, షేక్ గౌస్ పీరా, జె హైమవతి, ఈడే పద్మావతి, వి ఆనంద్, టివి సత్యనారాయణ, వి ఈశ్వరమ్మ, పళ్ళ నారాయణమ్మ, శాంతారావు, సలీమున్నీసా, వై ఏసుమణి, సీహెచ్ ఆదిలక్ష్మి, బి లక్ష్మీ, జి లక్ష్మీకుమారి, కె అరుణ, పూడి కోటేశ్వరరావు, ఎన్ గనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-అవనిగడ్డ: కోడూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులు చేసే యంత్రాల సామర్థ్యం గురించి సూపర్వైజర్స్ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్, రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

వైసిపి ఓటమే లక్ష్యం : బసవ

ప్రజాశక్తి-పెడన: గత ఐదేళ్లుగా అణగారిన వర్గాలపై జగన్ ప్రభుత్వం చేస్తున్న అరచకాలను తిప్పి కొట్టేందుకు మాదిగలందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి బసవ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా బసవ



మాట్లాడుతూ దళితుల ఓట్లతో గద్దెనెక్కి అధికారాన్ని చేపట్టిన అనంతరం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం దురదష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొక్కిలిగడ్డ సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డ ప్రచారం


ప్రజాశక్తి-గన్నవరం: ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలు వింటూ ముందుకు సాగుతున్నారు టిడిపి కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు. ఆదివారం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో జనప్రభంజనం



మధ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలను వింటూ పరిష్కార మార్గాలను అన్వేషిస్తూ ఎన్నికల ప్రచారం ముందుకు సాగింది. సూపర్ సిక్స్ ప్రణాళికను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

నిరుద్యోగం సమస్య పరిష్కారానికి కృషి : రాము

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడివాడ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని గుడివాడ టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రజలకు హామీ ఇచ్చారు. బాబు షఉరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ కాలనీ, జేమ్స్ పేట, సంత రోడ్ లలో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో ను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి రాముని, గ్లాస్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, మాజీ వైస్ జెడ్పి చైర్మన్ సాయిన పుష్పవతి, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.





మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ సెంట్రల్ సిటీలో మూడు సంవత్సరాలుగా వివిధ సేవాకార్యక్రమాలు చేస్తున్న హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఏప్రిల్ నుండి జులై వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతి ఆదివారం మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. మొదటి ఆదివారం అజిత్ సింగ్‌నగర్‌లోని పి అండ్ టి కాలనీ వద్ద మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ పాదచారులకు, వాహనచోదకులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సీనియర్ సభ్యులు ఎం.బాలసూర్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటివరకూ తమ ఫౌండేషన్ వైద్య రంగంలోవిద్యారంగంలో అనాథాశ్రమాల్లో వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఫౌండేషన్ అధ్యక్షులు శశికాంత్ మాట్లాడుతూ తమతో పాటు కొందరు దాతలు ఈ కార్యక్రమానికి ముందుకురావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్, కోశాధికారి ఎం.రవికుమార్, ఉపాధ్యక్షులు రఫీ సహాయకార్యదర్శి యు.కనకారావు సభ్యులు ఎంవిఎస్ఎన్.ప్రసాద్ అప్పలరాజు కిరణ్మయి కె.సీతారామారావు ఉషాదీప్తి పి.గణేష్ కుమార్, పి.వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీ అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయన ఆదివారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనం తరం వేద పండితులు వీరికి వేదాశీర్వ చనం చేయగా ఈఈ కోటేశ్వర రావు ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

మజ్జిగ పంపిణీ : దర్శనార్థం ఆలయానికి వచ్చిన యాత్రికులకు వేసవి సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి రోజు చేస్తున్న ఈ కార్యక్రంలో భాగంగా ఆదివారం దర్శనార్థం వచ్చిన కమిషనర్ పంపిణీ చేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు ఈఈ కోటేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.

ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా విడుదల

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీదారులలో ఒకటైన ఏథర్ ఎనర్జీ సంస్థ సరికొత్తగా ఫ్యామిటీ స్కూటర్ రిజ్టాను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి ఎం.ఎస్.ఆర్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ అవసరాలకు కావాల్సిన విధంగా స్కూటర్‌ను డిజైన్ చేసినట్లు తెలిపారు. అత్యాధునిక ఇంజనీరింగ్ టెక్నాలజీతో తయారైన రిజ్టా స్కూటర్ సౌకర్యం, సౌలభ్యంతో పాటు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇది డ్యాష్ బోర్డులోని స్కిడ్ కంట్రోల్, వాట్సాప్ వంటి ఫీచర్లతో సహా రైడింగ్ అనుభవాన్ని మెరుగుపరచే విధంగా ఉంటుందన్నారు. దీని ధర రు. 1,09,999 ఎక్స్ షోరూమ్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు.

'పవర్ లిఫ్టింగ్' నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్స్ సమావేశం తిరువూరు పట్టణంలోని ఫిట్ జోన్ వ్యాయామశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రెండు జిల్లాల పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వి.మల్లేశ్వరరావు, కోశాధికారిగా బుడిపూటి వెంకట్రావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎమ్.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎండి.సహిద, కోశాధికారిగా ఉషారాణితోపాటు పలువు రు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ పవర్ లిఫ్టింగ్ ప్రెసిడెంట్ ఎమ్.ప్రభాకర్, సౌత్ ఇండియా కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు పాల్గొని నూతన అధ్యక్ష,కార్యదర్శి, కార్యవర్గ సభ్యులకు అభినందలు తెలియజేశారు.

జగన్ పాలనలో ప్రజాభివృద్ధి : కేశినేని నాని

ప్రజాశక్తి - భవానీపురం : సంపద సృష్టిస్తా... పేదలకు పంచుతా అని చంద్రబాబు చెప్పడం పెద్ద బూటకమని విజయవాడ ఎంపీ, వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. చంద్రబాబు పాలన కన్నా... నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధి పెరిగిందని, ప్రజల ఆదాయం పెరిగిందని, పేదరికం తగ్గిందని ఆయన చెప్పారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి ఆయన ఆదివారం ఉదయం 43వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేశినేని నాని మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజల స్థూల వార్షిక ఆదాయం రూ.1.68లక్షలు కాగా, అదే సీఎం జగన్ పాలనలో రూ.2.34లక్షలకు పెరిగిందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ వైద్య రంగానికి రూ.18 వేల కోట్లు, విద్యా రంగానికి రూ.14 వేల కోట్లు ఖర్చు చేసి ఆస్పత్రులు, పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. అసిఫ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధిని వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్నామని, అదే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో చెప్పుకోవడానికి ఏమీ లేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ బాపతి కొట్టిరెడ్డి, విశ్వబ్రాణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కార్పొరేటర్లు చైతన్య రెడ్డి, మరుపిళ్ల రాజేష్, మాజీ కార్పొరేటర్ బట్టిపాటి సంధ్యారాణి, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాసరావు, నాయకులు అత్తులూరి పెద్దబాబు, మైలవరపు దుర్గారావు, నర్సారెడ్డి, మాదాల తిరుపతిరావు పాల్గొన్నారు.



ప్రచారంలో నాని, ఆసిఫ్, మేయర్, తదితరులు

కొండ ప్రాంత ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు కృషి : సిపిఐ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కార్పొరేషన్ పరిధిలోని స్థలాలను క్రమబద్ధీకరించి రిజిస్ట్రేషన్ చేయించామని, తనను ఎంఎల్‌ఏగా గెలిపిస్తే కొండ ప్రాంతంలోని ప్రతి ఇంటికి పట్టా ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు చెప్పారు. స్థానిక 51వ డివిజన్‌లోని కొత్తపేట వాగుసెంటర్ కొండ ప్రాంతంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండ ప్రాంతంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం అభివద్ధికి కమ్యూనిస్టులు ఎంతో కృషి చేశారని తెలిపారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ తరపున గెలిచిన కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని నేటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని చెప్పారు. నిత్యం ప్రజల మధ్య ఉంటే, ఏ సమస్య వచ్చినా పిలిస్తే పలికే కమ్యూనిస్టులను గెలిపించాలని జి.కోటేశ్వరరావు కోరారు. సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పడియ్య, చింతాడ పార్వతీ, కే. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వం 400 సీట్లు సాధించి దేశంలోని లౌకికవాదానికి తూట్లు పొడవాలని కుటీల యత్నాలు చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. ఆదివారం వన్‌టౌన్‌లోని లెనిన్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.



ప్రచారంలో కోటేశ్వరరావు, తదితరులు

రమేష్ నివాసానికి శివనాధ్, సుజనా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని టిడిపి విజయవాడ ఎంపి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ పశ్చిమ బిజెపి అభ్యర్థి వై.సుజనా చౌదరి చెప్పారు. ఆదివారం ఉదయం వన్‌టౌన్‌లో టిడిపి నాయకులు కొణిజేటి రమేష్ స్వగృహం వద్ద నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో చిన్ని, సుజనా చౌదరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురికి వేద పండితులు వేద మంత్రాల మధ్య ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సుజనా చౌదరి మాట్లాడుతూ తనకు ఢిల్లీలో ఉన్న పరిచయాలతో విజయవాడ నగరాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. టిడిపి నాయకులు కొణిజేటి రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, బిజెపి అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. టిడిపి వాణిజ్య విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు రాజు సోలంకి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమి ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పిళ్ళా సుదర్శన్‌రావు, అమరా గోపాలకృష్ణ, ఈది సాంబశివరావు, బిజెపి నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఎన్.ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుజనా

ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఖిల్లా వద్ద గల ప్రాచీన పుణ్యక్షేత్రం హజ్రత్ సయ్యద్ గాలిబ్ షహీద్ బాబా దర్గా 436వ ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూఫీ మాత గురువులు అల్తాఫ్ బాబా పాల్గొన్నారు. కొండపల్లి పురవీధుల గూండా ఊరేగింపుగా సాగిన గంధం మహోత్సవం, తెల్లవారుజామున కొండపై దర్గా వద్దకు చేరుకుంది. బాబా వారికి ప్రత్యేక చాదర్, గంధం మహోత్సవం సమర్పించిన అనంతరం మానవాళి శ్రేయస్సు కొరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్తాఫ్ బాబా ముజావర్ల ఆధ్వర్యంలో యాత్రికులకు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ముజావర్లు సయ్యద్ కమాలుద్దిన్ల కిర్మనీ సొదరులు సభ్యులు, ముతవల్లి సయ్యద్ అస్లాం, ఖలీల్, ఖాజా, సయ్యద్ నజీరుద్దీన్ బాబా పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ఉరుసు మహోత్సవం

ఇఫ్తార్ విందులో కొలికపూడి

ప్రజాశక్తి - విస్సన్నపేట : కొర్లమండలో ముస్లిం పేటలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన, ఇఫ్తార్ విందులో తిరువూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. ముస్లింలు ఆత్మీయంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మట్ట వేణు ఎన్ఆర్ఐ వల్లభనేనిగిరి జిల్లా నాయకులు నెక్కలపు శ్రీను, ఆకుల రాధ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు యాసిన్, జనసేన నాయకులు తోట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ కొత్త లాటెక్స్ ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : పెయింటింగ్ కంపెనీలలో అగ్రగామిగా ఉన్న ఏషియన్ పెయింట్స్ సరికొత్తగా నియో భారత్ లాటెక్స్ పెయింట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ సిఇఒ అమిత్ సింగాల్ తెలిపారు. నగరంలోని సంస్థ రీజనల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. నియో భారత్ లాటెక్స్ పెయింట్ అనేది ప్రత్యేకమైన పాలిమర్ టెక్నాలజీని కలిగి ఉందన్నారు. ఈ పెయింట్ అందమైన ఫినిష్, ఎక్కువ కవరేజ్, మెరుగైన వాషబులిటీని అందిస్తుందన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా ఏషియన్ పెయింట్స్ ఎప్పటికపుడు సరికొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. పెయింట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా విరాట్ కోహ్లి వ్యవహరించనున్నారని తెలిపారు.

అన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆరంభ్ - 2024

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐఐటి, జెఇఇ, నీట్ యూజీ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ఆరంభ్ - 2024 ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అన్ అకాడమి సంస్థ ఇన్‌ఛార్జి కె.ప్రసాద్‌బాబు తెలిపారు. ఎం.జి.రోడ్డులోని అన్ అకాడమి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వివరాలను తెలిపారు. దేశంలోనే అతిపెద్ద లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లో అగ్రగామిగా ఉన్న అన్ అకాడమి రానున్న విద్యా సంసవత్సరంలో ఎక్కువ మంది విద్యార్థులకు ఐఐటీ జెఇఇలో శిక్షణ ఇవ్వడంతో పాటు మంచి ఫలితాలు సాధించేలా కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గతంలో తమ సంస్థ ద్వారా మంచి విజయాలు సాధించిన ఐఐటి ర్యాంకర్లతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో మంచి మార్కుల సాధనకు ఏవిధంగా కృషి చేయాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక అవకాశం ఇవ్వండి : జైభీమ్ శ్రీనివాస్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే నందిగామ నియోజవర్గం సంక్షేమాలు, అభివృద్ధి చేయడం నా బాధ్యతగా తీసుకుంటానని తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ, నందిగామ నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, విజయవాడ పార్లమెంటు ఎంపి అభ్యర్థి జై భీమ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నందిగామ నియోజవర్గంలో ఎన్నికల ప్రచారం భాగంగా, వచ్చే అసెంబ్లీ ఎలక్షన్లో నందిగామ నియోజకవర్గ ప్రజలు రబ్బర్ స్టాంప్ గుర్తుపై ఓటు వేసి, నందిగామ ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇస్తే, నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు అన్ని మౌలిక వసతులు కలిపిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలు ఒక అవకాశం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు.



ప్రచారంలో పాల్గొన్న జైభీమ్ శ్రీనివాస్

దళితుల సమస్యలపై పోరాడే సిపిఎంకు మద్దతివ్వండి

ముస్తాబాదలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం: దళితుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న సిపిఎంకు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని సిపిఎం నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం ముస్తాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చిన దళితవాడ, బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని సిపిఎంకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మైనారిటీలపై దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, దళిత మహిళలకు రక్షణ లేకుండా పోతుందని చెప్పారు. దళితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న సిపిఎంకు అండదండగా ఉండాలన్నారు. ముస్తాబాద్ గ్రామంలో దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సాగు భూములు పంచాలని సిపిఎం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. కొండ పోరంబోకు భూములు దళితులకు వచ్చేలా చేశామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ భూములు వారికి అందకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కళ్లం కోటయ్య, కైలే ఏసుదాసు, కళ్లం రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నున్న గ్రామంలో ఓ దాత రూ.25 వేలు పార్టీకి విరాళం అందజేశారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న బిజెపి : శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-గన్నవరం: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బత్తుల శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మికుల యూనియన్ ఏర్పాటు చేసుకునే వీలు లేకుండా 44 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకురావడమే కాకుండా, ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేలా బిజెపి కుట్ర చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూల చట్టాలను రూపొందిస్తున్న, మతోన్మాద చర్యలకు పాల్పడుతున్న బిజెపితో పొత్తు ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి బిజెపితో పొత్తులు పెట్టుకుని రాష్ట్ర అభివద్ధి కోసం కృషి చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇలాంటి కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలకు మద్దతుగా పని చేస్తున్న సిపిఎంకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు చెరువుగట్టు ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.



'సూపర్ సిక్స్' కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం

విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఆదివారం గన్నవరం నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ సోదరుడు యార్లగడ్డ సతీష్, తన భార్య లక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ టిడిపి ఎన్నికల మేనిఫెస్టోను, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి వెంకట్రావ్ చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు తలకోటి శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధు శివరామప్రసాద్ పాల్గొన్నారు.

236 మందికి వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిబిఆర్ ఫౌండేషన్ మరియు ప్రజా ఆరోగ్య వేదిక మరియు ప్రముఖ న్యూరాలజిస్టు డా.గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జ్యోతి బాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్య శిబిరం కన్వీనర్ పామర్తి నాగయ్య తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 236 మందిని పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులను రెండు వందలకే అందించడం జరిగిందన్నారు. ప్రతి రెండు నెలలకొకసారి నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ న్యూరాలజిస్టు వైద్యులు గోపాలం శివన్నారాయణ సూచించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డి ఆర్ కె ప్రసాద్, కుప్పా రామశాస్త్రి, పి.సురేష్ చంద్రారెడ్డి, శంకరానంద్, మానసాదేవి పాల్గొన్నారు.



రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక పడమర వీధిలో గౌసేపాక్ దర్గా వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో నలభైకి పైగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను ఆదివారం అందజేశారు. అడపా వెంకట్రామయ్య – నాంచారమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు అడపా గురవయ్య (మాస్టారు), అడపా రాంబాబు, మోపిదేవి రాములు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోపిదేవి వెంకటేశ్వరరావు తోఫా కిట్లను లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు నర్రా సాయిబాబు, సభ్యులు తగిరిశ సాంబశివరావు, కార్యదర్శి రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి ప్రసాద్ అందించారు.

కొడాలి ప్రచారం

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని ఒకటో వార్డులో శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆదివారం ఎన్నికలప్రచారాన్ని



ప్రారంభించారు. అనంతరం వార్డులోని హోసన్న మినిస్ట్రీస్ చర్చిలో కొడాలి నాని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వివిధ వర్గాల ప్రజానీకంతో మమేకమవుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు పాలేటి చంటి, దుక్కిపాటి శశి భూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, జడ్పిటిసిలు గోళ్ళ రామకృష్ణ, కందుల దుర్గా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వేమవరంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 20 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్‌బాబు తెలిపారు.






కృష్ణారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-ఉయ్యూరు: పేద ప్రజల కోసం పాటుపడిన వ్యక్తులు చరిత్రలో నిలిచిపోతారని సిపిఎం రాష్ట్ర నాయకులు మాగంటి హరిబాబు అన్నారు. ఆదివారం పెద ఓగిరాల గ్రామంలో సిపిఎం సానుభూతిపరుడు కట్టా రామకృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. తొలుత కృష్ణారెడ్డి చిత్రపటానికి హరిబాబు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రజల కోసం పాటుపడే వ్యక్తులుగా కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. కృష్ణారెడ్డి యువజన సంఘంలో పనిచేస్తూ అప్పటి పాలకులకు వ్యతిరేకంగా జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలతో చివరివరకు జీవించారని, కృష్ణారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి బి.రాజేష్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరు శివ నాగేంద్రరావు, తోట్లవల్లూరు మండల కార్యదర్శి సేలం ప్రకాష్ రావు, టిడిపి నాయకుడు పోతురాజు రెడ్డి, అట్లూరు రామచంద్రరావు, ఎస్కే ఇస్మాయిల్ బి కీర్తి గోపాల్, పి.లక్ష్మణరావు అన్నే సుబ్బారావు పి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో శంఖారావం

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మండలం శారదాయిపేట గ్రామంలో పెడన నియోజకవర్గం టిడిపి, జనసేన బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి కాగిత కృష్ణప్రసాద్,



పార్లమెంట్ అభ్యర్థి బాలసౌరికి గాజు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతన స్వామి, గోపి నాగబాబు, కాసగాని శ్రీనివాసరావు, బొర్రా శ్రీను, పామర్తి రమేష్, శయన సోమయ్య, పోతుల రాము, సిరివెళ్ల శ్రీను పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా జై భీమ్ యువజన సేవా సంఘం వారి ఆధ్వర్యంలో అంబేద్కర్ వారోత్సవాల్లో భాగంగా ఆటల పోటీలను స్థానిక నీలకంఠేశ్వరపురం లో ఆదివారం ప్రారంభించినట్లు జై భీమ్ యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోత్రు నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత దళిత కుల పోరాటయోధుడు ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వారోత్సవాలను పురస్కరించుకొని యువతకు వాలీబాల్ ,రన్నింగ్ ,స్కిప్పింగ్ మహిళలకు ముగ్గుల పోటీలు మ్యూజికల్ చైర్స్ షటిల్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆటలు పోటీలలో తొలి రోజు వాలీబాల్ ఆటలు పోటీలు ప్రారంభించామని తెలిపారు.



భూహక్కు చట్టంతో ప్రజల ఆస్తులు తాకట్టు : ప్రసాద్



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా తెచ్చిన భూహక్కు చట్టం వల్ల రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ భూ హక్కు చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఆస్తుల తాకట్టేనన్నారు. బ్రిటీష్ పాలకులు కూడా చేయని ఘోరమైన పనులు ముఖ్యమంత్రి జగన్, వైసీపీ పాలకులు చేస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన నేత పవన్ కళ్యాణ్‌లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాబట్టి రాబోయే ఎన్నికలలో టిడిపి, జన సేన కూటమి అభ్యర్థులు కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, పి.వి.ఫణి కుమార్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు లంకి శెట్టి నీరజ, టిడిపి లీగల్ సెల్ మహిళా న్యాయవాది మోపిదేవి గోవర్ధనమ్మ పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కృష్ణాజిల్లా నూతన కలెక్టర్ డికె.బాలాజీ ఆదివారం విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో సహా వచ్చిన ఆయన దుర్గగుడిలో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహనాధికారి కెఎస్ రామరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఈవో అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ఇఫ్తార్ విందులో వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజక వర్గంలోని పలు డివిజన్లలో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఎంఎల్‌ఎ, సెంట్రల్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఉపవాసం చేసిన మైనారిటీ సోదరులకు భోజనం వడ్డించారు.



సుజనా, చిన్నిపై కేశినేని నాని ఆగ్రహం

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిపై, రియల్ ఎస్టేట్‌పై పెట్టిన శ్రద్ధ విజయవాడ అభివృద్ధిపై పెట్టలేదని విజయవాడ ఎంపి, వైసిపి అభ్యర్థి కేశినేని నాని విమర్శించారు. దీంతో విజయవాడ 60 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను టిడిపి నుండి వైసిపిలోకి వచ్చిన తర్వాత నుండి తనపై కొన్ని వార్తా చానెల్స్ అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. బిజెపి నుండి పోటీచేస్తున్న సుజనా చౌదరి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై చేసే ప్రచారాల నిరూపించాలని సవాల్ విసిరారు. సుజనా చౌదరి గురించి తనకు 25 సంవత్సరాల నుంచి తెలుసని, రాజ్యసభ సభ్యుడు కాకముందు ఆయన ఏం చేశారో కూడా తెలుసునని అన్నారు. రాజ్యసభ సభ్యుడు అయ్యాక ఏం చేసారో చెప్తే కొన్ని పత్రికలు రాయవని అన్నారు. 2014 నుండి 2019 వరకూ చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు అమరావతిపై, రియల్ ఎస్టేట్‌పై పెట్టిన శ్రద్ధ విజయవాడ అభివృద్ధిపై పెట్టలేదన్నారు. 2018లో తనకు కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టించి ఎన్డీయేలో నుంచి బయటికి వచ్చి ప్రధాని మోడీని నానా దుర్భాషలాడిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ బిజెపి చెంతన చేరారని విమర్శించారు. అమరావతికి నిధులు ఇవ్వలేదని మోడీని ఎన్నో మాటలన్నారని గుర్తుచేశారు. మోడీ, చంద్రబాబు అప్పుడు ఎందుకు విడిపోయారు ? ఇప్పుడు ఎందుకు కలిశారు ? అని ప్రశ్నించారు. అప్పుడు ఇవ్వని నిధులు ఇప్పుడు ఇస్తానన్నారా అని చంద్రబాబునుద్దేశించి వ్యాఖ్యానించారు. విజయవాడ పశ్చిమ సీటు ముస్లింలకు ఇస్తానని టిడిపి చెప్పి వారిని మోసం చేసిందన్నారు. అలాగే విజయవాడ పశ్చిమ సీటు బిసిలకు ఇస్తానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారని, కానీ పోతిన మహేష్‌కు టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి బ్యాంకు దోపిడీలు, వ్యాపారాల గురించి తనకు తెలుసునని, ఆయనపై ఉన్న కేసుల గురించి తనకు తెలుసునని అన్నారు. చంద్రబాబు విజయవాడ పశ్చిమ సీటును బడాబాబులకు ఇచ్చారని విమర్శించారు. సీఎం జగన్ మాత్రం ఒక సామాన్య కార్పొరేటర్‌గా ఉన్న ఆసిఫ్‌కి సీటు ఇచ్చారని పేర్కొన్నారు. తాను ఇక్కడే పుట్టా, ఇక్కడే పెరిగా.. కేశినేని భవన్ అంటే విజయవాడలోనే కాదు ఆంధ్రప్రదేశ్ మొత్తం తెలుసునని కేశినేని నాని అన్నారు.

ఫ్యాన్ గాలికి సైకిల్ కొట్టుకుపోతుంది : దేవినేని అవినాష్

వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌ను అభివద్ధి చేసి ఓట్లు అడుగుతున్నామన్నారు. ఏ ముఖంతో టీడీపీ నేతలు ఓటు అడుగుతారని ప్రశ్నించారు. గొడవలు సష్టించి లబ్ధి పొందాలని స్థానిక టీడీపీ నేతలు చూస్తున్నారని విమర్శించారు. హుందాతనం కోల్పోతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చనిపోయిన వ్యక్తులపై దూషణలు చేయడం ద్వారా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గంజాయికి ఆద్యులు టిడిపి నేతలేనని అన్నారు.

వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు అవసరం : డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండ తీవ్రతకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పంచాయతీరాజ్, మునిసిపల్, గ్రామీణ నీటిసరఫరా, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలన్నారు. చలివేంద్రాలు సజావుగా పనిచేసేలా చూడాలన్నారు. అవసరమైతే అదనంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, వయోవద్ధులు తదితరుల విషయంలో ప్రత్యేక జాగ్రతలు పాటించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలు సమన్వయతో పనిచేస్తూ అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన ఆరోగ్య సేవలు అందేలా చూడాలన్నారు. వడదెబ్బ తగలకుండా నీరు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని.. తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. రోజులో కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలని.. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలన్నారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ఉపయోగించాలన్నారు. తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని వివరించారు.



సుజనా చౌదరి, కేశినేని చిన్నిపై వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - వన్ టౌన్ : పశ్చిమ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి, టిడిపి పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)పై ఎన్నికల రిటైర్నింగ్ అధికారికి వైసిపి నేతలు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇద్దరు నేతలు కలిసి ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనలను ధిక్కరించి గత రెండు రోజుల క్రితం భవానీపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మహిళలు హారతులు ఇచ్చిన సమయంలో డబ్బులు ఇచ్చిన ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల మాట్లాడుతూ డబ్బు సంచలతో పశ్చిమ నియోజకవర్గాన్ని కొనుగోలు చేద్దామని రాజకీయాలు చేస్తున్న వారికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు.



టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్థానిక బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష పేపర్ల స్పాట్ వేల్యూషన్ ప్రక్రియను ఆదివారం గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డి.దేవానంద రెడ్డి పరిశీలించారు. స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి సౌజన్యంతో మజ్జిగను పంపిణీ చేశారు. నిర్దేశిత గడువులోగా ఫలితాల ప్రకటనకు సిద్ధం చేయాలని సూచించారు.

ఉద్యమాల చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

అరసం కవితా గోష్టిలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : దేశ స్వాతంత్ర్య సంగ్రామం, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, అల్లూరి సీతారామ రాజు వంటి వారి చరిత్రను వక్రీకరించి సమాజంలో ప్రజలు వారి వారి మత విశ్వాసాల పట్ల విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కేంద్రంలో పాలక భాజపా ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సాధారణ ఎన్నికల్లో ఓడించాలని పలువురు సాహిత్య వేత్తలు ఉద్ఘాటించారు. ప్రప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపకులు విఐ లెనిన్ శత వర్ధంతి ఏడాది పురస్కరించుకుని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఎన్ టి ఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయం హాల్‌లో కొత్త సంవత్సరంలో "ఎన్ని"కలలో అంశం పై ఉగాది కవితా గోష్టి నిర్వహించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. పాఠ్యాంశాల్లో మనువాద భావజాలం చొప్పిస్తు ఉన్నారని, ఇటీవల విడుదలైన రాజాకార్, ట్రిపుల్ ఆర్ సినిమాల్లో తెలంగాణా సాయుధ పోరాటం , అల్లూరి చరిత్రను వక్రీకరించి మత కల్లోలాలు సష్టించడానికి ఉదాహరణ అని అయన ఎద్దేవా చేశారు. అల్లూరి సీతా రామరాజు మాల పిల్ల పిల్ల వంటి సినిమాలు మళ్ళీ విడుదల కావాల్సిన అవసరం ఉందన్నారు.

మొదటిపేజీ తరువాయి



మాట్లాడుతున్న బోడే ప్రసాద్

తులసి వనంలో గంజాయి మొక్కలు

మంత్రులయ్యారు. ఎవడెక్కువ బూతులు తిడితే వాడికి మంత్రి పదవి, ఎవరు దాడులు చేయిస్తే వారికి ప్రమోషన్లు ఇచ్చే దారుణమైన పరిస్థితి నెలకొందన్నారు. అమరావతి అభివృద్ధి చెంది ఉంటే ఇక్కడి భూములకు ధరలు పెరిగేవని, గ్రామాలు, ప్రజల దశదిశ మారిపోయేవని అన్నారు. కానీ ఈ గంజాయి బ్యాచ్ అమరావతితో ఆడుకున్నారని, మూడు రాజధానులంటూ బుద్ధీ జ్ఞానం లేని వారు, గుంతలు కూడా పూడ్చలేనివారు మూడు రాజధానులు కడతానంటున్నారని విమర్శించారు. పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లో ప్రజలకు ఎన్నికల హామీలు ఇచ్చారు. పామర్రు మండలంలో నిమ్మలూరులో బెల్ కంపెనీ ఏర్పాటు చేశామని, ఈ ప్రాంతంలో ఐటి టవర్ ఏర్పాటు చేసి, వర్క్ ఫ్రం హోం పద్ధతిలో యువత ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. డొంకరోడ్ల, నిర్మాణం, సాగునీటి కాల్వల ఆధునికీకరణ, లంక గ్రామాలకు రోడ్లు, వంతెనల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ అవసరాల రీత్యా తమ సీట్లను త్యాగం చేసిన మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమాకు మంచి భవిష్యత్ కల్పిస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఇసుక, గ్రావెల్ అమ్ముకుని మినీ లోటస్ పాండ్ కట్టుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జనసేన మచిలీపట్నం ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మచిలీపట్నం, పెడన, పామర్రు, పెనమలూరు, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి అభ్యర్థులు కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, బోడే ప్రసాద్, కొలుసు పార్థసారథి, టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో బాలుడిని ఎత్తుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ఉయ్యూరులో ప్రజాగళం సభ

మాజీ ఎంఎల్‌సి వైవిబి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఉయ్యూరు మార్కెట్ సెంటర్‌లో ప్రజాగళం సభ జరిగింది. ఈ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఎంఎల్‌ఎ అభ్యర్థి బోడే ప్రసాద్ మాట్లాడుతూ మరోసారి తనకు పెనమలూరు నుండి పోటీచేసే అవకాశం చంద్రబాబు ఇచ్చారని, ఆయనకు తాను రుణపడి ఉంటానని అన్నారు. 2014లో ఎంఎల్‌ఎగా గెలిచి ఎన్నో అభివద్ధి కార్యక్రమాలు చేశానని, యనమలకుదురు నుంచి ఉయ్యూరు దాకా వందల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు అభివద్ధి చేశానని చెప్పారు. నూజివీడు అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి మాట్లాడుత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో నడిపించడానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వినాశ్రయం ఫ్లైవోవర్ పూర్తి

దగ్గర రోడ్డు ముగుస్తుంది. ఫ్లైఓవర్ నిర్మాణానికి ఎటువంటి భూసేకరణ జరగలేదు. అది నేషనల్ హైవే భూమిలో వేగవంతంగా నిర్మితమైంది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా ఫ్లైఓవర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. విమానాశ్రయంలో కొత్తగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కు వాహనాల రాకపోకల కోసం కొత్త రహదారిని నిర్మిస్తున్నారు. విజయవాడ నుంచి విమానాశ్రయం వైపు వెళ్లే వాహనాలు కేసరపల్లి నుంచి ఫ్లైఓవర్ మీదుగా వెళ్తాయి. ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలు సర్వీస్ రోడ్డు నుంచి లోపలికి వస్తాయి. మిగిలిన వాహనాలు ఫ్లైఓవర్ మీదుగా వెళ్లి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెడతారు. అంతేకాకుండా వీవీఐపీల రాకపోకల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరింత సులభతరం అవుతుందని చెబుతున్నారు.

ఫ్లైవోవర్ వద్ద జాగ్రత్తలు అవసరం

ఈ ఫ్లై ఓవర్ విమానాశ్రయం మెయిన్ గేటు వద్ద ప్రారంభమవుతుంది. ఏలూరు వైపు నుంచి వెళ్లే వాహనాలు ఫ్లైఓవర్ మీదుగా వెళ్లి కేసరపల్లిలో దిగుతాయి. అయితే మెయిన్ గేటు వద్ద ఐటీ కంపెనీలకు, ఆర్టీవో ఆఫీస్ కి వెళ్లడానికి యూటర్న్ తీసుకోవాలి. ఆ సమయంలో గన్నవరం నుంచి వేగంగా ఫ్లైఓవర్ మీదకు వెళ్లే వాహనాలు రోడ్డు దాటేవారిని ఢీకొట్టే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించిన సమయంలో నాలుగు ప్రమాదాలు జరిగాయి. 20 మంది వరకు తీవ్ర గాయాల గురయ్యారు. ఇద్దరు మరణించారు. కనీసం ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయకూడదని నిబంధన ఉండటం వల్ల అధికారులు వీటిని వేయడానికి ముందుకు రాలేదు. ఫ్లై ఓవర్ ఓపెన్ చేసి వాహనాలు వదిలితే మెయిన్ గేటు వద్ద ఎన్ని ప్రమాదాలు జరుగుతాయోననే ఆందోళన ప్రజల్లో నెలకొంది. ఎయిర్పోర్ట్ కొత్త టర్మినల్ లోకి వెళ్లేందుకు వాహనాలకు వెటర్నరీ కళాశాల ఎదురుగా అండర్ ప్రాస్ ఇచ్చారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు సడన్ గా వంతెన కింద నుంచి విమానాశ్రయం లోపల కు వెళ్లే సమయంలో, సర్వీస్ రోడ్లో కేసరపల్లి వైపు వచ్చే వాహనాలు ఢీకొట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా ఈ ఫ్లై ఓవర్ ఎన్నికల తర్వాత ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



మాట్లాడుతున్న కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని అటువంటి వారికి మనమే గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి చైతన్యపరచాలని పారిశ్రామికవేత్త, లయన్ పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. హనుమాన్ జంక్షన్ లో ఆదివారం కాకాని కళ్యాణ మండపం లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మరియు పుట్టగుంట సతీష్ కుమార్ హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పుట్టగుంట మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని..తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ప్రజలు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. పుట్టగుంట సతీష్ కుమార్ బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారని వందలాది హెల్త్ క్యాంప్ లు నిర్వహించటమే కాకుండా వేలాదిమంది కి ఆయన ప్రత్యక్షంగా పరోక్షంగా చేసిన సేవలు అభినందనీయం అని చైర్మన్ చలసాని అన్నారు. సీనియర్ కార్డియాలజిస్ట్ జి. కష్ణ మోహన్ మాట్లాడుతూ గుండె జబ్బుల పట్ల నిర్లక్షం వహించక అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రమేష్ హాస్పిటల్స్ సీనియర్ వైద్యులు పావులూరి శ్రీనివాసరావు, రైతు నాయకులు నందూరి సత్య వేంకటేశ్వర శర్మ, హనుమాన్ జంక్షన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్, లయన్ తాడి రంగారావు, మాజీ జెడ్పిటిసి సుంకర సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు, లయన్ నందిగం స్వామి పర్యవేక్షణలో జరిగింది. హనుమాన్ జంక్షన్ చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన 500 మంది ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకున్నారు.అ ందరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందించారు.



సమాజానికి శ్రీభరత్ సేవలు అవసరం : ఆళ్ల

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

విశాఖపట్నం ప్రజలకు మోతుకుమిల్లి భరత్ సేవలు ఎంతో అవసరం అని రాష్ట్ర టిడిపి నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి పోటీ చేయబోతున్న టిడిపి ఉమ్మడి కూటమి అభ్యర్థి మోతుకుమిల్లి శ్రీ భరత్, విశాఖపట్నం ఉత్తరం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అసెంబ్లీ అభ్యర్థి పెనుమత్స విష్ణుకుమార్ రాజు విజయాన్ని కాంక్షిస్తూ కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ లోని ప్రఖ్యాత అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి చిత్రపటాన్ని, కండువాను రాష్ట్ర టీడీపీకార్య నిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర తదితరులు కలిసి విశాఖపట్నంలోని మోతుకుమిల్లి భరత్, పెనుమత్స విష్ణుకుమార్ రాజులను కలిసి అందజేశారు.

పోలవరం పూర్తి కావాలంటే టిడిపి రావాలి

యార్లగడ్డ సతీష్

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే టిడిపి అధికారంలోకి రావాలని గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ తెలిపారు.బాపులపాడు మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం తన భార్య లక్ష్మీ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను గన్నవరం నియోజకవర్గ అభివద్ధికి యార్లగడ్డ వెంకట్రావ్ చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగిన పోలవరం నిర్మాణం ఈ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయం అని వచ్చిన వెంటనే పోలవరం నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు వల్లూరుపల్లి నాని, కార్యదర్శి కోరం రూబేను, తెలుగు యువత అధ్యక్షులు కోరం సుధీర్, నాయకులు పొట్లూరి బెనర్జీ పొట్లూరి సుధాకర్, జనసేన నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ గ్రూప్ సభ్యుడు గుడివాక వారి పాలెం గ్రామానికి చెందిన బండే మాధవరావుకు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ఆ సంస్థ అధ్యక్షులు మతి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొండవీటి తులసిరావు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇఫ్తార్ విందు




ప్రజాశక్తి-అవనిగడ్డ

జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆదివారం అవనిగడ్డ ఏడవ వార్డులోని మసీదు వద్ద రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా శేషుబాబును శాలువాతో సత్కరించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు

చట్టబద్ధ పాలన కోసమే సంకల్ప ర్యాలీ : బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాష్ట్రంలో విధ్వంసక పాలన అంతమొందించి చట్టబద్ధమైన పరిపాలనకు కూటమీ అభ్యర్థులతో కూడిన ప్రభుత్వం రాష్ట్రంలో రావాలని మాజీ ఉపసభాపతి అవనిగడ్డ నియోజకవర్గ కూటమి అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీన జనసేన మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తొలిసారి ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేంద్ర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మోటారు సైకిళ్లతో సంకల్ప ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్క అవకాశం అని కోరి అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం ప్రజల హక్కులు కాలరాసిందన్నారు. ఇసుక, మట్టి దోపిడీతో వచ్చిన సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల జడ్పిటిసి మెడ బలిమి మల్లికార్జునరావు, జనసేన జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రనాథ్, కో కన్వీనర్ తుంగల వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

బుద్ధప్రసాద్‌ను కలిసిన మత్స్యకారులు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుండి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవాసమితి ప్రధాన కార్యదర్శి లక్నో నాగాంజనేయులు స్పష్టం చేశారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులతో బుద్ధ ప్రసాదును ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు కర్రీ కృష్ణమూర్తి, లంకె శ్రీనివాస ప్రసాద్, సైకం విజయభాస్కర్, కోపనాతి ముత్యం, జయరావు, కొల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిసిల రక్షణకు ప్రత్యేక చట్టం : జ్ఞానేశ్వరి



ప్రజాశక్తి-గన్నవరం: మరో రెండు నెలల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు గన్నవరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ సతీమణి జ్ఞానేశ్వరి తెలిపారు. స్థానిక శ్రీనగర్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింకి తిరుగుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను గన్నవరం నియోజకవర్గ అభివద్ధికి తన భర్త వెంకట్రావ్ చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గన్నవరం టౌన్ అధ్యక్షుడు జస్టి శ్రీధర్, ఎంపీటీసీలు కొమ్మరాజు సుధీర్, పడమట రంగారావు, మద్దినేని వెంకటేశ్వరావు, పాలడుగు నాని, గూడపాటి తులసీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలతో బెంబేలు

ప్రజాశక్తి-పెడన: గత నాలుగేళ్లుగా సామాన్యుడిని విద్యుత్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నడ్డి విరుస్తుంది. యూనిట్, సర్వీస్ ధరల కాకుండా విద్యుత్ వ్యాట్ పేరుతో లబ్దిదారులపై అధిక భారం పడుతుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చాప కింద నీరు లాగా కోట్ల రూపాయలు లబ్ధిదారుల వద్ద నుంచి దండుకుంటుంది. కేవలం నియోజవర్గంలోని 15 కోట్లకు పైమాటే వసూలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే కొంతమేర నోటీసులు ఇచ్చి వసూలు చేస్తున్నారు. ఇదంతా చూస్తున్న రాజకీయ నాయకులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలోని పెడన మున్సిపాలిటీలో 15 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 13 వేలకు కనెక్షన్లకు 1.1/2, 2 కిలో వాట్స్ విద్యుత్ ఓల్టేజ్ పెంచాలని డిమాండ్ నోటీసులు సిద్ధం చేశారు. వీటిల్లో మీటరు రీడింగును బట్టి ఇప్పటికే ఒకటిన్నర కిలో వాట్స్‌కి రూ. 3442, 2 కిలో వాట్స్‌కి రూ.4736 ల చొప్పున డిమాండ్ నోటీసులు ఇచ్చి విద్యుత్ శాఖ వసూలు చేస్తుంది. అలాగే రూరల్ మండలంలో 23 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వీటిల్లో 17 వేల సర్వీస్ కనెక్షన్లకు 2 కిలో వాట్స్ విద్యుత్ అదనపు భారం వినియోగిస్తున్నారు, అంటూ ఇప్పటికే నోటీసులు తయారు చేశారు. అలాగే గూడూరు మండలంలోని 16,500 మీటర్లకు, బంటుమిల్లి మండలంలోని 15 వేల మీటర్లకు, కృత్తివెన్ను మండలంలోని 14,250 వేల మీటర్లకు అదనపు విద్యుత్ ఉపయోగిస్తున్నారు అంటూ వినియోగదారుల వద్ద నుంచి అధిక ఓల్డ్ జ్ పేరుతో ఆ శాఖ అధికారులు కార్యాలయాల్లో చలనాల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. 2014 వరకు ఒక కిలో వాట్స్ 1450 రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉండేది. అయితే 2015 నుంచి ఒక కిలో వాట్స్ రూ.2368లను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేవలం నియోజకవర్గంలోని పట్టణ, రూరల్ మండలం, గూడూరు, బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లోనే దాదాపు 15 కోట్ల రూపాయలకు పైగా భారం పడుతుంది. దీంతో చేసేది లేక విద్యుత్ వినియోగదారులు నోటీసులు తీసుకుని అదనపు ఓల్డ్ జీ బిల్లులను చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఎల్లవేళలా మానవతా అండగా నిలుస్తుందని రాష్ట్ర కన్వీనర్, మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మినేడు గ్రామానికి చెందిన వీసం మహేష్ వీఐటీ యూనివర్సిటీ అమరావతి లో ఫస్ట్ బీటెక్ చదువుతున్న విద్యార్థికి ఫీజు నిమిత్తం మానవతా సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించారు. మానవత విద్యానిధి నుండి రూ.10 వేల చెక్కును ఏలూరు రోడ్లోని కార్యాలయం వద్ద మంగళవారం విద్యార్థికి అందజేశారు. మానవత విద్యా నిధి నుండి రూ.10 వేలు, మానవతా హనుమాన్ జంక్షన్ యూనిట్ నుండి బోయిన కోటేశ్వరరావు రూ.2 వేలు, బాణాల నరసింహారావు రూ.3 వేలు, నారగాని కొండలరావు రూ.1000, కూరేళ్ల సుభాచారి రూ.500, వడ్డీ రాజేశ్వరరావు రూ. 500 మొత్తం 17 వేల రూపాయలు అందించారు.ఈ కార్యక్రమానికి మానవతా రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు అధ్యక్షులు కూరెళ్ళ సుభాచారి సెక్రటరీ కళ్లే పల్లి నారాయణరావు జిల్లా ఖజానాధికారి వడ్డీ రాజేశ్వరరావు డైరెక్టర్ నారగాని కొండలరావు జన్యావుల వీర వెంకట సత్యనారాయణ పీవీఎస్ చలం జయ రామచంద్రరావు బి శ్రీరామ్మూర్తి ఆర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్‌లో కబేళా నిర్మించొద్దు

పునరావస కేంద్రాల్లో నివసిస్తున్నవారికి పట్టాలివ్వాలి

వాంబేకాలనీలో పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - అజిత్ సింగ్ నగర్ : వాంబేకాలనీ, తదితర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్న వారికి పట్టాలివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. సింగ్‌నగర్, పాయికాపురం, రాజరాజేశ్వరి పేట, వాంబే కాలనీల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసిన గృహాల్లోనే నివసిస్తున్నారన్నారు. వీరికి పట్టాలిస్తామని గత టిడిపి ప్రభుత్వం, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కాలయాపన చేశారన్నారు. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ప్రాంతాల్లో సిపిఎం నాయకులు కార్పొరేటర్‌గా పనిచేసిన రోజుల్లో రిజిస్ట్రేషన్ పట్టాలిచ్చామని అన్నారు. వాంబే కాలనీలో ఇంటి పట్టాలపై ఇంటి యజమాని ఫొటో లేకుండా ముఖ్యమంత్రి ఫొటో వేయడం ఏమిటని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ లేని పట్టాల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని రిజిస్ట్రేషన్ లేకపోవటం వల్ల బ్యాంకు లోన్లు ఇవ్వటం లేదని, పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారని మంచినీళ్లు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారని పట్టించుకునే వారే లేరని అన్నారు. సిపిఎం అధికారంలోకి రాగానే పునరావస కేంద్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి రిజిస్ట్రేషన్ పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. 15 సంవత్సరాల నుండి ప్రజలను ఎంఎల్‌ఎలు మోసం చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోవటం లేదని సిపిఎం అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని అన్నారు. గతంలో పనిచేసిన టిడిపి వైసిపి ఎమ్మెల్యేలు భూకబ్జాలు చేసి ఆస్తుల పెంచుకున్నారే గాని పేదలకు చేసింది ఏమీ లేదన్నారు.

వాంబే కాలనీలో డిస్నీల్యాండ్‌లో 57 ఎకరాలు కబేళాకు ఇవ్వటం ఏమిటని, మనుషుల కన్నా పశువులను వధించే కార్పొరేట్ వారికి ఈ స్థలం ఇవ్వటం ఎందుకని ప్రశ్నించారు. కబేళా కావాలంటే నగరానికి బయట పెట్టుకోవాలని ప్రజలకు డిస్నీలాండ్ స్థలాన్ని ఇవ్వాలని అన్నారు. ఈ ప్రాంతంలో సరైన రైల్వే బ్రిడ్జి లేదని నడవటానికి వీలుగా ఉండే దాన్ని కూడా మూసివేశారని దానివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్య వచ్చినా ముందుండి నడిపించే కమ్యూనిస్టులకు అండగా ఉండాలని పేదల కోసం పోరాటాలు చేస్తూ అనేక ఇబ్బందులు పడిన ప్రజలకు అండగా కమ్యూనిస్టులు మాత్రమే అని ప్రజలందరూ ఆలోచించి సీపీఎం, కమ్యూనిస్టులకు ఓటు వేయాలని ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సీటు కార్యదర్శి బి.రమణారావు, అధ్యక్షులు కె.దుర్గారావు డివిజన్ ఇన్‌ఛార్జ్ కె.పేరు, బాబూరావు, చింతల శ్రీనివాస్, కార్యకర్తలు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.



మహిళా వ్యాపారితో మాట్లాడుతున్న బాబూరావు

: సింగ్ నగర్ పాయకాపురం డివిజన్లలో సిపిఎం పాదయాత్ర కరపత్రాలు పంపిణీ చేశారు. బాబూరావు మాట్లాడుతూ టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సింగ్‌నగర్ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌లా మార్చారన్నారు. చెత్త నుండి ఎరువు బొగ్గు విద్యుత్ తయారు చేసే సంస్థలు పెట్టి ప్రజారోగ్యానికి హాని కలిగించారు. భవన నిర్మాణ వ్యర్థ పదార్థాల నుండి ఇటుకలు తయారు చేసే మరో పరిశ్రమ పెట్టి కాలుష్యాన్ని సష్టించారన్నారు. కుక్కలకు ఆపరేషన్ చేసే కేంద్రాన్ని పెట్టి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేశారన్నారు. డంపింగ్ యార్డ్ పొగతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారని మండిపడ్డారు. సిపిఎం నాయకత్వంలో ప్రజలు దీర్ఘకాలిక ఆందోళన చేయటం వల్ల చెత్త కాలుష్యం నివారణ చర్యలు చేపట్టారన్నారు. ఈ ప్రాంతంలో బ్రాందీ షాపులు బార్ల సంఖ్య పాలకులు పెంచేశారని దుయ్యబట్టారు. గంజాయి మత్తు పదార్థాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. బుడమేరు ముంపు నివారణ శాశ్వత చర్యలు ఇంకా పూర్తి కావలసి ఉందని గుర్తు చేశారు.



చెస్ విజేతలు

శ్రీ చైతన్యలో చెస్ పోటీలు

విజేతలు ఎం.బాబు శామ్యూల్, జె.నందిక

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : జూనియర్స్ చెస్ అకాడమీ, ది విజయవాడ చదరంగం సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కేంద్రంగా శ్రీ చైతన్య స్కూల్ గాయత్రి నగర్‌లో U-17 బాల బాలికల చదరంగ పోటీలు ఆదివారం రసవత్తరంగా సాగాయి. ఈ పోటీలకు ఎన్టీఆర్ జిల్లా మారుమూల ప్రాంతాల నుంచి 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. శ్రీ చైతన్య స్కూల్స్ రీజినల్ ఇన్చార్జి రావి పద్మ, స్కూల్ ప్రిన్సిపాల్ యు.రజిత డీన్ రామకృష్ణ ఈ వివరాలు తెలిపారు. U-17 బాలుర విభాగంలో మందుల బాబు శామ్యూల్ 6 పాయింట్లతో ప్రథమ, జి.వై చంద్రవర్మ 5 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. బాలికల విభాగంలో జలవాడి నందిక 4 పాయింట్లతో ప్రథమ, ఎస్.కె.జులేఖ బహార్ 3 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో తొలి రెండు స్థానాలు గెలిచిన బాల బాలికలను ఈ నెల కృష్ణాజిల్లాలో 20, 21 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు సర్టిఫికెట్లను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్‌డి అక్బర్ పాషా, మందుల రాజీవ్ అందజేశారు.

'ఫ్యూచర్ కిడ్స్'తో గీతం ఒప్పందం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఐసిఎస్ఇ పాఠశాల అనుబంధ సంస్థ ఫ్యూచర్ కిడ్స్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఫ్యూచర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులకు ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. తమ విశ్వవిద్యాలయంలో మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా ఎప్పటికపుడు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని వాటికి అనుగుణంగా విద్యార్థులకు కోర్సులను అందించేందుకు ఈ అవగాహనా ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఉపకారవేతనం కూడా అందించేలా తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ నిర్మలారావు పలువురు పాల్గొన్నారు.

దీపాలంకరణ తయారీ పోటీలు

విజయవాడ : ఠాగూర్ స్మారక గ్రంథాలయం గవర్నర్ పేట, విజయవాడలో శ్రీ క్రోధి నామ సంవత్సరం యుగాది సందర్భంగా విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల తయారీ) పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా, ఆసక్తిగా పాల్గొని తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి రకరకాల దీపాలను తయారు చేశారు. వాటిని అందంగా అలంకరించి విభిన్న దీపాలను తయారు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి మాట్లాడు తూ ఉగాది అంటే తెలుగు సంవత్సరం ఆరంభం అని అన్నారు. ప్రకతిలో కనిపించే మామిడి, వేప పూత మొదలగు నవి సష్టి ప్రారంభాన్ని తెలియచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాటల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందచేశారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కృష్ణాజిల్లా చెస్ పోటీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఎస్.ఆర్.ఆర్ ఛారిటబుల్ ట్రస్టు, ఆధ్వర్యంలో పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో అండర్ -17 కృష్ణాజిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కృష్ణా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో బాలుర విభాగంలో 33 మంది, బాలికల విభాగంలో 20 మంది క్రీడాకారులు పాల్గొనగా మొత్తం ఐదు రౌండ్లుగా పోటీలను నిర్వహించినట్లు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్.ఎం. ఫణికుమార్ తెలిపారు. వీటితో పాటు వివిధ ఏజ్ కేటగిరిలో బాల, బాలికలకు విడి విడిగా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. మొదటి రెండు స్థానాలు సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు కూడా అందించినట్లు పేర్కొన్నారు. అండర్ -17 విభాగంలో మొదటి ఇద్దరు క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీలలో గుడివాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో కృష్ణాజిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో భాగంగా సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు గ్రీన్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ, ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ పి.రేణుక, ఎస్‌ఆర్‌ఆర్ చెస్ కోచింగ్ అకాడమి అధ్యక్షులు జె.సౌజన్య, విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా చెస్ మేనేజర్ జి.రామకృష్ణ, గుడివాడ చెస్ మేనేజర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఎం.ఈ.సుమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతల వివరాలను ప్రకటించారు.

విజేతల వివరాలు...

అండర్ -17 బాలుర విభాగంలో కె.సందీప్, ఎం.జితేష్ నాగ్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, బాలికల విభాగంలో ఎస్.జాయ్ ప్రశస్త, ఎస్క్ష. జోష్లిన్ ప్రశస్త ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. అండర్ -7 బాలుర విభాగంలో కె.సుహిరిత్, నాగ వెంకట పుష్కల్ మొదటి రెండు స్థానాలు సాధించగా, అండర్ -9 బాలుర విభాగంలో ఏ.శ్రేయస్, జి.వర్షిత్ మొదటి రెండు స్థానాలు సాధించారు. అండర్ -11 బాలుర విభాగంలో ఆర్.దర్శి, ఏ.సుహాస్ , అండర్ -13 బాలుర విభాగంలో యు.హర్షిత్ సాయి, కె.సాయి సాత్విక్, అండర్ -15 బాలుర విభాగంలో పి.ప్రవీణ్, ఎస్.రోహన్ విజేతులగా నిలిచారు. అలాగే అండర్ -7 బాలికల విభాగంలో జె.దివిష చౌదరి, పి.జోష్నిక, అండర్ -9 విభాగంలో





ఎం.మనోరి శ్యామ్, వై.యశస్వి, అండర్ -11 విభాగంలో నాగమహశ్రీ, పి.గీతిక, అండర్ -13 బాలికల విభాగంలో జె.లాస్య, కె.కావ్యశ్రీ, అండర్ -15 బాలికల విభాగంలో జి.స్వాతి విజేతలుగా నిలిచారు. అలాగే ప్రతి మంగళవారం, శనివారాలలో ఆన్‌లైన్‌లో జరిగే పోటీలలో విజేతలకు కూడా బహుమతులు అందచేశారు. ఎస్.రోహన్, బి.వశిష్ట, శ్రేయేష్, ఎం.జితేష్ నాగ్‌లు విజేతలుగా నిలిచారు.

గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'



పుస్తక పఠనంలో విద్యార్థులు

విజయవాడ : చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిం చారు. ప్రతి మాసం మొదటి ఆది వారం "పుస్తక ప్రదర్శన" ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాల యాధికారి పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే నీతి కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించామని తెలిపారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ 'పిల్లల నేస్తం పుస్తకం' అన్నారు. చిరిగిన చొక్కా తొడుక్కొ సమస్య లేదు. కానీ మంచి పుస్తకం కొనకుంటే మాత్రం అజ్ఞానిగా ఉంటావని.. పుస్తకాలు చదవడం ఎంతో మంచిదని.. మీ జ్ఞానానికి మెరుగు పెట్టినట్లే అని అన్నారు. పుస్తకాన్ని చదవండి జీవితాన్ని ప్రేమించండి అని చిన్నారులకు తెలిపారు. పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలకు అదిరోహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు,చిన్నారులు పాల్గొన్నారు.

ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశాం

వైసిపి తూర్పు అభ్యర్థి అవినాష్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేసి ఓటు అడుగుతున్నామని, రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి దేవినేని అవినాష్ కోరారు. ఆదివారం పటమట 14వ డివిజన్ ఎన్‌టిఆర్ సర్కిల్, దర్శిపేట ప్రాంతాల్లో దేవినేని అవినాష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి చేసిన విధానాన్ని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని, మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఇప్పటికే జగన్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి రాష్ట్రంలో జరిగిందని, ప్రతి డివిజన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారంలో అవినాష్